


అత్తగారూ-ఆవు నం: 23

బాగా పాలిచ్చే ఒక మంచి ఆవును కొనాలని ఎంతో కాలంనుంచి మా అత్తగారి సంకల్పం. దానికోసం చాలాచోట్ల విచారించింది. చుట్టు ప్రక్కల వూళ్ళన్నీ గాలించింది. కాని ఆవిడకు నచ్చిన ఆవు దొరకలేదు. ఆవుముఖం లక్షణంగా లేదనో, పీలగా వుందనో, రంగు బాగా లేదనో, సుడులు బాగా లేవనో, పళ్లు మొలవలేదనో, వున్నపళ్లు పూడాయనో వంక పెట్టేది. మొత్తంమీద అన్నివిధాలా నచ్చిన ఆవు ఆవిడకు కనుపించలేదు.

ఆర్నెల్లక్రితం మా పక్కింటివాళ్ళు బదిలీఅయి వెళ్ళిపోతూ, వాళ్ళ గేదెను, అమ్మేందుకు వ్యవధిలేక, మాకు వాళ్ళ జ్ఞాపకార్థం "ఉండనివ్వండి" అంటూ మా యింటికి తోలి వెళ్ళిపోయారు ......... ఆవు దొరక్క-పోయినా, అనుకోకుండా అంత మంచిగేదె దొరికినందుకు మా అత్తగారు మహా ఆనందపడిపోయారు. "ఇంకమీద ఆ పాలవెధవదగ్గిర గేదెపాలు కొనే అవస్థ తప్పిపోయింది...." అంటూ మురిసిపోయింది.

కాని గేదెకు మేత ఏం పెట్టాలో, ఏమిటో మా అత్తగారికి బాగా తెలీదని మాత్రం నాకు బాగా తెలుసు. ఆవిడికి ఆవుసంగతి తప్ప గేదె సంగతి తెలీదు. దానికి తగినట్లు మా తోటవాడికి పూలమొక్కల సంగతి తప్ప గొడ్డూ, గోదా సంగతి అసలు తెలీదు. 'పాలు పిండడంమాత్రం చాతవు' నన్నాడు.

"పోనీ, మన పాలవాడినే కొద్దిరోజులపాటు మన గేదెకు మేతా గీతా చూడమంటే ఒదిలిపోతుందిగా!" .... అన్నాను మా అత్తగారికి సలహా యిస్తూ.

"హవ్వ...." అన్నారు మా అత్తగారు.

హడలిపోయాను....'ఏం తప్పన్నానా' అని.

"అదికాదే. వాడిదగ్గర మనం పాలుకొంటం మానేశామనే కోపంతో గేదె కేదైనా మందూ, మాకూ పెట్టి చంపితే! ... అన్యాయంగా, చూస్తూ చూస్తూ, తెలిసి తెలిసి నోరులేని గొడ్డును తీసికెళ్ళి పులినోటి కందిస్తా, నంటావే!...." అంటూ నా తెలివితక్కువకు బాధపడ్డారు...

"మరి మన తోటవాడికి దాని మేతసంగతి తెలీదంటున్నాడే!".... అన్నాను.

"ఆ వెధవకి తెలీకపోతే నాకు తెలీదనుకున్నావా?.... అయినా, అదేం పెద్ద బ్రహ్మవిద్యగనక!....మా పుట్టింటివాళ్ళకు గేదె అచ్చిరాలే దనేగాని, చిన్నప్పట్నుంచీ నేను ఆవుల్తోనే పెరిగాను .... ఆవెంతో గేదంతా....దాని మేతెంతో దీని మేతంతా....కాకపోతే ఆవుకంటే కాస్త అధికంగా తింటుంది గేదె...ఈ మాత్రానికి పోయి వాణ్ణీ వీణ్ణీ అడగడం ఎందుకూ, పన్లేనిపనీ!..." అంటూ కోప్పడ్డారు మా అత్తగారు....

సరే మనకెందుకొచ్చిందని వూరుకున్నాను.

పాలవాడొచ్చి గేదెను చూడాలని సంబరపడ్డాడు ... మా అత్తగారు వీల్లేదు పొమ్మన్నది. వాడిని గేదె ప్రాంతాలకుకూడా వెళ్ళనివ్వకుండా, తనే స్వయంగా, స్వహస్తాలతో, మూడు పూటలూ దిట్టంగా గేదెను మేపడం మొదలెట్టింది....

మొదట రెండురోజులూ పక్కింటివాళ్ళ కిచ్చిన పాలకంటే చాలా ఎక్కువే యిచ్చింది....

మే మంతా మా అత్తగారికి జంతురక్షణ విషయంలో వున్న అనుభవానికి ఆశ్చర్యపడిపోతూ ఆమెను అభినందించాం....

"అంతేనే....ఏదైనా అంతే,...పిండికొద్దీ రొట్టె...." అన్నారు మా అత్తగారు అలక్ష్యంగా చప్పరిస్తూ.

మర్నాడు గేదె టక్కున సగంపాలు తగ్గించేసింది...,కారణం తెలీక ఖంగారు పడ్డారు మా అత్తగారు. ఆరోజంతా ఆలోచించి దానికి యింకా తిండి చాల్లేదనే తీర్మానానికి వచ్చారు. వెంటనే పత్తిగింజలూ, సజ్జలూ, యింకా ఏవో తెప్పించారు బజార్నుంచి. అంతకుముందు గేదెకు వేస్తున్న కందిపొట్టు, పెసరపొట్టు, గోధుంపొట్టు, శెనగపొట్టు, గానుగచెక్క, తౌడు, పచ్చిగడ్డి, ఎండుగడ్డి వగైరాలతోబాటు పత్తిగింజలు రుబ్బి, సజ్జలు ఉడికించి మొత్తం అన్నీ కలిపి గేదె ఒద్దంటున్నా వినకుండా బ్రతిమాలి దాని కడుపు నిండా పట్టించారు.

మర్నాడు ప్రొద్దుటే పాలు పిండడానికి వెళ్ళిన తోటవాడిని ఒక్క తాపు తన్నింది గేదె. వాడి ముందుపళ్లు రెండూ విరిగిపోయాయి. ఇహ దగ్గిర కెళ్ళినవాళ్ళందర్నీ వెనక్కాళ్ళతో ఝాడించి తన్నడం మొదలెట్టింది. మా అత్తగారు దానికి పెట్టిన యమతిండియొక్క బలం ఆ విధంగా చూపిస్తోం దనిపించింది.... కారణం ఏమిటాని దూరంగా నిలబడి ఆలోచించడం మొద లెట్టాను.

గేదె కడుపు విపరీతం లావుగా వుంది...ఆయాస పడుతూంది.... ఒకచోట నిలవకుండా చిందులు తొక్కుతోంది. దాని అవస్థ చూస్తే ఒకవేళ కడుపునొప్పితో బాధపడుతోందేమోనని అనుమానం కలిగింది నాకు. ఆసంగతి చెప్పిచూశాను.

"ఛా! వూరుకో....దృష్టికళ్లా నువ్వూనూ! గేదెకు తిండి ఎక్కువ కావడం ఏమిటే, తక్కువయిందని చెప్పు....అసలు యింతకూ ఆ పాల వెధవ దృష్టి కొట్టింది దానికి" అన్నారు మా అత్తగారు.

"పాపం, వాడు అసలు గేదెను చూడనేలేదుగా!" అన్నాను.

"చూడాలా! మనసులో ఏడ్చుకుంటే చాల్దూ!" అంటూ అది పాల వాడి మనోదృష్టే నని తేల్చారు మా అత్తగారు....

వెంటనే ఒకవీశ మిరపకాయలూ, అరవీశ కర్పూరం, మానెడు ఉప్పూ, ఒక పాతచీపురుకట్టా, వగైరా సేకరించి, దూరంనుంచే గేదెకు దృష్టి తీశారు....పాలవాడిని తిట్టుకుంటూ, పటపట మెటికలు విరుస్తూ.

ఆ రాత్రే గేదె చచ్చిపోయింది.

ఈ సంగతి విని పాలవాడు ఒకటే గోల - "అయ్యో! దానికి కాస్త యింగువా, వెల్లుల్లిపాయలూ నూరి మింగిస్తే బతికే దమ్మగారూ. బంగారం లాంటి బఱ్ఱెను, తిండి ఎక్కువపెట్టి, పెద్దమ్మగారు సంపేశారమ్మా...." అంటూ ఏడ్చాడు.

"ఛా వెధవా! నోర్ముయ్—మళ్ళీ ఆ మాటన్నావంటే పళ్లు రాలకొట్టిస్తాను—అసలు నీ దృష్టితోనే పోయిందది—" అంటూ పాలవాడిమీద మండిపడ్డా రావిడ.

"ఒకవేళ వాడు చెప్పినట్లు మందూ మాకూ వేస్తే బ్రతికేదేమో పాపం" అన్నాను భయపడుతూనే....

"ఆఁ, నా తలకాయ బ్రతికేది—ముందేచెప్పానుగదే!...మా పుట్టింటి వాళ్ళ దగ్గిర్నుంచీ చూస్తున్నాగా, మనకు గేదె అచ్చిరాదు—అంతే" అన్నారు మా అత్తగారు.

మళ్ళీ పాలవాడిచ్చేపాల పాల బడ్డాము మేము. రాను రాను ఆవుపాలు కటిక నీళ్లుగా తెచ్చి యిస్తున్నాడు. మూడుపూటలూ ఆవుపాలమీదనే ఆధార పడే మా అత్తగారు, పాపం, ఆ కటిక నీళ్ళు మింగలేక అవస్థపడ్డారు. ఏదో ఒక ఆవును వెంటనే కొనాలనే తీర్మానానికి వచ్చారు. ఈ సారైనా పాల వాడి సలహా తీసుకుంటే మంచిదని తోచింది నాకు.

"అబ్బే-ఆవుసంగతి వాడి కేం తెలుసునే!"—అన్నారు మా అత్త గారు చప్పరిస్తూ....

"ఎక్కడుందో విచారించమందాం-మనకు నచ్చితేనే కొందాం".... అని నెమ్మదిగా నచ్చజెప్పాను.."సరేనీయిష్టం".. అన్నారావిడఅయిష్టంగానే.

సుమారుగా వుంటే చాలు, పాలుమాత్రం బాగా యిచ్చే ఆవు కావాలనీ, ఎక్కడ దొరుకుతుందో వెంటనే చూడమనీ పాలవాడు రాగానే పురమాయించాను.

"ఎందుకూ! గేదెను చంపింది చాలక మళ్ళీ ఆవునుకూడా చంప దల్చుకున్నారా, అత్తా కోడలూ?" అన్నారు మా వారు, పైన బాల్కనీలో నిలబడి నవ్వుతూ. మా అత్తగారికి కోపం వచ్చింది....పాలవాడు పక్కకు తిరిగి తలగుడ్డచాటున నవ్వుకున్నాడు, మావారి మాటలకు....

"చంపితే చంపాన్లేరా...ముందీ నీళ్ళపాలు తాగలేక నేను చస్తున్నాను" అంటూ మా అత్తగారు విసుక్కున్నారు...

"సరే అయితే. ఉండండమ్మగారూ, రేపు శుక్రారంనాడు సంతకాడికెళ్ళి మంచి ఆవుగా చూసి పట్టుకొస్తాను'' అన్నాడు పాలవాడు.

"ఛాఛా...ఈ ఊరు సంతలో మంచి ఆవు ఎక్కడ దొరుకుతుందిరా, నీముఖం! మీకు మంచి ఆవు కావాలంటే ఒకచోట దొరుకుతుంది" అన్నారు మావారు.. మా అత్తగారి ప్రాణం లేచొచ్చింది.

"ఎక్కడ్రా?'' అన్నారు మా అత్తగారు పైకి చూస్తూ.

"చెప్తాను—కాని ఖరీ దెక్కువ. అంతేకాదు. దానికి టైము ప్రకారం మేతా గీతా వేయాలి, లేకపోతే ప్రయోజనంలేదు. అదంతా దొర్ల సమాచారం—సీమావులు అక్కడ వుండే వన్నీ."

"ఏ ఆవు అయితే నేమిట్రా, వేళ కింత మేత వెయ్యాలంటావు. అంతేగా! వేస్తాను. ఆవును పెంచడం నాకలవాటేలే" అన్నారు మా అత్తగారు.

"అబ్బే—నువ్వు పెంచడం గించడం పనికిరాదు, దానికి ప్రత్యేకంగా ఓ మనిషిని పెడతానంటేనే చెప్తాను,'' అన్నారు మా వారు, వాళ్ళ అమ్మను ఏడిపించడానికి.

"సరే, అట్లాగే చేద్దాంలే—ముందా ఆవు ఎక్కడుందో చెప్పు''—అన్నారు మా అత్తగారు.

"ఇక్కడికి యిరవైమైళ్ళ దూరంలో, యాభై ఎకరాల స్థలంలో, కొత్తగా ఒక 'ఫారమ్' ఓపెన్ చేశారు. అక్కడ కొన్నివందల ఆవులూ, ఎద్దులూ, గేదెలూ, దున్నపోతులూ దొరుకుతాయి..." అని మా వారు చెబుతూంటే పాలవాడి చెవుల్లో అమృతం పోసినట్లయింది...

"అబ్బో! అబ్బో! కొన్నివందల గొడ్లే! అయితే ఆ సోటు యింద్ర లోకంలా గుంటదన్నమాట...అయితే యీ యాళే అడి కెళ్ళి ఓ మంచి ఆవును సూసి పట్టకొస్తా సోమీ" అన్నాడు పాలవాడు, హుషారుగా, తలగుడ్డ చుట్టుకుంటూ.

"నువ్వెక్కడికిరా. మాటకుముందు అపశకునంలాగా!...నేను వెళ్ళి చూసొస్తాలే" అన్నారు మా అత్తగారు.

"నువ్వెందుకమ్మా వెళ్ళడం!—యాభై ఎకరాల స్థలంలో, అన్నివందల పశువుల్లో, నీకు నచ్చిన ఆవు ఎక్కడుందో తిరిగి వెదకడం మాటలా! నా మాట విని వాణ్ణి వెళ్ళరానీ'' అన్నారు మా వారు.

"వాడు వెళ్తే ఎట్లారా! నాకు నచ్చిన ఆవు ఏదో వాడి కెట్లా తెలుస్తుంది! నా కంటితోగదా చూడా లంటున్నాను."

"అవసరం లేదమ్మా! అక్కడుండే అవు లన్నీ మంచి ఆవులే! నీ కేలాంటిది కావాలో వాడికి గుర్తులు చెప్పి పంపించు. వాడి కీ ఆవుల సంగతీ, గేదెలసంగతీ తెలుసుగా!" అన్నారు మావారు.

"చూడండి సోమీ—మరీ యీ పెద్దమ్మగారు నన్ను అసలు ఏమీ తెలవని గాడిదకింద కట్టేసింది. ఆవు నా కచ్చిరాలే దన్నమాటేగాని సిన్నప్పటాల్నుంచి గొడ్లతో పుట్టి గొడ్లతో పెరిగాను. ఏ గొడ్డు ఎట్లాంటిదో నాకు తెల్సు—నా సంగతి గొడ్డుకు తెల్సు" అన్నాడు పాలవాడు, మా వారి ఆసరా చూసుకొని, కాస్త ధీమాగా.

"ఇంతెందుకురా! అక్కడ ఫారమ్ మేనేజరుగా వున్నది నాఫ్రెండే. వాడూ నీలాగే గొడ్లతో పుట్టి, గొడ్లతో పెరిగిన సగం గొడ్డు. వాడి కో

ఉత్తరం రాసిస్తాను తీసికెళ్ళివ్వు. అక్కడుండేవాటిలో మంచి ఆవుగా చూసి మనకి పంపిస్తాడు" అన్నారు మా వారు.

"అయితే సిక్కా లేదు—అట్టనే సెయ్యండి సోమీ—అయితే ఎప్పు డెల్లమంటారు సోమీ?'' అన్నాడు పాలవాడు.

"అదంతా నాకు తెలీదు. పెద్దమ్మగార్నడుగు"—అంటూ మావారు లోపలి కెళ్ళి పోయారు.

"మరి యీపూటే ఎళ్ళమంటారా పెద్దమ్మగారూ?" అన్నాడు పాలవాడు.

"ఈ పూట ఎట్లా వెళ్తావురా, యింకా చవితి మిగు లుంటేనూ?—పన్నెండు గంటలతర్వాతగాని పంచమిఘడియలు రావు. మధ్యాన్నించివెళ్లు" అన్నారు మా అత్తగారు.

"సరే అయితే, అట్టనే కానీయండి—''అంటూ పాలవాడు గేదెల్ని తోలుకుని యింటికి వెళ్ళిపోయాడు.

మధ్యాన్నం రెండుగంటలకంతా వచ్చేశాడు పాలవాడు. ఎఱ్ఱపంచ, పచ్చచొక్కా, ఊదారంగు తలగుడ్డతో పూలరంగడిలాగా ముస్తాబై వచ్చాడు. వాడి వెనకాలే వాడి యిద్దరు పెళ్ళాలూ వచ్చారు—చిలకపట్టుచీర కట్టి, సిగనిండా పూలుచుట్టి, నోటినిండా తాంబూలం బిగించి, ముసిముసి నవ్వుల్తో, సీతాకోక చిలకల్లాగా వచ్చి, వాకిట్లో వున్న టెంకాయచెట్లచాటున వాళ్ళిద్దరూ దోబూచులాడడం మా అత్తగారికంటపడ్డది....

"వాళ్ళెక్కడికిరా! వాళ్ళిద్దర్నీ తీసుకొచ్చా వెందుకూ?'' అన్నారు పాలవాడిమీద మండిపడుతూ.

"మేంగూడా చూస్తాంవంటా ఎంటబడ్డారం డమ్మగారూ'' అన్నాడు సిగ్గుపడుతూ పాలవాడు.

"పాపం, వాళ్ళనుకూడాతీసుకెళ్ళనీయమ్మా...తీసుకెళ్ళరా, నీయిద్దరు పెళ్ళాల్నీకూడా తీసుకెళ్ళు....తస్సాదియ్యా ఛాన్సంటే నీదిరా. ఛాన్సు ....ఈ కాలంలో ఇద్దరు పెళ్ళాల్ని ఒక్క మాటమీద లాక్కొస్తున్నావంటే నిజంగా నువ్వురా 'హీరో'వి. అనుభవించు అనుభవించు" అంటూ హుషారుగా నవ్వుతూ మా వారు పాలవాడి అదృష్టానికి లోలోపలే ఈర్ష్యపడ్డారు...నాకు నవ్వొచ్చింది...మా వారికి నా మీద కోపం వచ్చినప్పుడంతా "వెధవ పాల వాడికి యిద్దరు పెళ్ళాలు..." అంటూ వుంటారు. పాలవాడిని చూస్తే మా వారికి ఈర్ష్య. వాడి యిద్దరు పెళ్ళాల్నీ చూస్తే మా అత్తగారికి ఒళ్ళుమంట. పాలవాడి యిద్దరుపెళ్ళాలూ నవ్వుతూ పేల్తూ ఒద్దిగ్గా వుండడం మా అత్త గారికి కొంచంగూడా నచ్చలేదు...."యిదేంవిడ్డూరమే! నే నెక్కడా చూళ్ళేదు!...సవతు లన్నతర్వాత పోట్లాడుకోవద్దూ!— మీ రిద్దరూ ఒక్క రోజూ పోట్లాడుకోరేం!" అని అడిగేది మా అత్తగారు...

"పోట్లా టెందు కమ్మగారూ!- మా యక్క నన్ను బాగానే సూసు కుంటది..." అనేది చిన్నది; "పోట్లా టెందు కమ్మగారూ! మా సెల్లె బాగానే సూసుకుంటది నన్ను..." అనేది పెద్దది...

వాళ్ళిద్దరూ ఆ విధంగా ఒక్క మాటమీద ఒద్దిగ్గా నిలిచి ఒకళ్ళమీ దొకళ్ళు ఆప్యాయం ఒలకబోసుకోడం మా అత్తగారి ఒళ్ళు మంటకు మరి కాస్త కారణ మైంది...ఎట్లాగయినా వాళ్ళిద్దరూ పోట్లాడుకుంటే చూడా లని తన శాయశక్తులా ప్రయత్నించారు...వాళ్ళిద్దరూ పోట్లాడుకోకపోగా "మీ కిదేం బుద్ధి పెద్దమ్మగారూ!" అంటూ ఒకసారి మెత్తగా చీవాట్లు పెట్టారు... దాంతో వాళ్ళిద్దర్నీ చూస్తే మా అత్తగారికి అరికాలిమంట.

"అయితే యిద్దరు పెళ్ళాల్నీ వెంటేసు కెళుతున్నావే! మరి సాయం కాలం పాలెవరు పిండుతారు!..." అన్నారు, వాడి పెళ్ళాలవైపు కొరకొర

చూస్తూ. "మా తమ్ముడి కాడ చెప్పా నమ్మగారూ. ఆడు తోలుకొచ్చి పెండుతాడు" అన్నాడు పాలవాడు.

"సరే అయితే, వెళ్ళిరా. తీరా, అక్కడికి వెళ్ళింతర్వాత నీ యిద్దరు పెళ్ళాల్నీ చూచుకుంటూ మా ఆవుసంగతి మర్చిపోవాక. మంచి ఆవుగా చూసి యిమ్మని అబ్బాయి స్నేహితుడితో చెప్పు. నల్లటి పొదలుండే ఆవు శ్రేష్ఠం. ఒక యీత రెండీతలకంటే పైనవేసింది మనకొద్దు. పళ్లు ఎన్ని మొలిచాయో చూడు. కొన్నిఆవులు గాడిదల్లా నడుస్తాయి. నడకచూడు. అన్నిటికంటే ముఖ్యం దాని ముఖం కళగా వుండాలి. తెలిసిందా? అదే యింటికి లక్ష్మి" అంటూ ఆవుకోసం డబ్బూ, మావారిచ్చిన ఉత్తరం రెండూ పాలవాడి చేతి కిచ్చి పంపించేశారు.

రాత్రి దాగా ప్రొద్దుపోయా వచ్చాడు పాలవాడు. యిద్దరు పెళ్ళాల్నీ యింటి దగ్గిర ఒదిలేసి సంతోషంగా, హుషారుగా వస్తున్న పాలవాణ్నిచూసి, "ఏంరా? యింతకీ వెళ్ళినపని అయిందా?" అన్నారు, వరండాలో లైటు వేస్తూ మా అత్తగారు.

"ఆఁ. ఎల్లుండి, శుక్రవారంనాడు యిరవై మూడో నెంబర్ను మనింటికి తోల్తున్నారు" అన్నాడు పాలవాడు.

"యిరవై మూడో నంబర్ను మనింటికి తోలడ మేవిట్రా! ఆవును గాదూ!..." అన్నారు మా అత్తగారు ఆశ్చర్యపడుతూ.

"అదేనం డమ్మగారూ, ఆవునే...ఆ డంతా నెంబర్ల 'షిష్టం'. పలానా ఆవు, పలానా బర్రె అంటే వాళ్ళకు తెలవదు. పలానా నెంబ రంటేనే ఎంటనే తెలుస్తది. ఒక్కొక్క గొడ్డును కట్టేసిన చోట్నే దాన్నెంబరు రాసిపెడతారు...అబ్బో! ఏం చెప్ప మంటారు పెద్దమ్మగారూ...ఆ గొడ్లకి యింద్రబోగంలా జరుపుతున్నారు...ఏమి తిండీ, ఏమి మేతా..."

"అది సరేరా-పోయిపోయి ఇరవై మూడో నెంబ రావునే ఎందుకు తీసుకున్నావు? ... అంతకంటే మంచినెంబరు దొరకనట్లు" ... అన్నారు

మా అత్తగారు, తన ఆమోదం లేకుండా వాడు ఏరిననంబరు చెడ్డదికాకుండా ఉంటుందా అన్న భరోసాతో.

"అయ్యో! నెంబ రేదైతే ఏంటమ్మగారూ! అస లాఅవు మీకు దొరుకు ద్దాండి...అయ్యగా రిచ్చిన ఉత్తరం తీసికెళ్ళి ఆ మేష్టరయ్యకా డిచ్చా - ఎం టనే నన్నాయ నెంటబెట్టుకొని ఆ డున్న ఆవు లన్నిట్నీ సూపాడు..అటిల్లో 'సక్కనిసుక్క' మ నావు" —పాలవాడు చెపుతూంటే సంతోషంతో మా అత్తగారి ముఖం వికసించింది.

"అయితే, ఇంతకూ, సుడీ, గిడీ చూసి తీసుకున్నావా?" అన్నారు.

"అబ్బే...మాట్లాడగూడదు — సుడీలేదు, పొడీలేదు. సుద్దంగా వుందావు" అన్నాడు పాలవాడు.

"నల్లపొడలా! తెల్లపొడలా!" అన్నారు మా అత్తగారు.

"నల్లపొడలు, తెల్లపొడలు, ఎఱ్ఱమచ్చలు, పసుప్పచ్చ గీరలు, ఆకుపచ్చసారలు, పొగాకురంగు సెవులు, బూడిదరంగు మొకం, అదేదో రంగులో వుందమ్మగారూ తోకా..."

"ఓరి నీతోక దొంగల్దోలా...యిన్ని రంగు లుంటాయట్రా ఒక ఆవుకు?..." అన్నారు ఆశ్చర్యపోతూ.

"అయ్యో. అది ఆవుగాదమ్మా, పంచరంగుల సిలకంటే నమ్మండి... పూటకి అయిదుమానిక లిస్తదంట.."

"ఏమిట్రా? పాలా, పంచితమా?..," అన్నారు మా అత్తగారు హడిలిపోయి...

"పాలేనం డమ్మగారూ" — అంటూ పాలవాడు తలగుడ్డ చాటున నవ్వాపుకోలేక చచ్చాడు...

"యిదెక్కడి విడ్డూరంరా!...పూటకు అయిదు మానికెలా! అయితే రోజుకు పదిమానికె లన్నమాట...నే నెక్కడా విన్లేదే!..." అంటూ ఆశ్చ ర్యంతో మా అత్తగారు దవడలు నొక్కుకున్నారు...

"అదంతా దొర్ల తర్ఫీతు, మీకు తెలవదులెండి పెద్దమ్మగారూ....ఆడ యింకో సంగతిన్నారా? ఒక్కో గొడ్డును రోజుకు అయిదారు మాట్లు పిండుతారంట...."

"హయ్యో! హయ్యో! .... యిదేం అన్యాయంరా .... అవెట్లా యిస్తాయీ....వీళ్ళెట్లా పిండుతారూ ...."

"ఆడంతా అంతే నమ్మగారూ. ఆడుండే గొడ్లని 'రూలుసుల' మీద నడిపిస్తారంట—ఏ బర్రె కెన్ని నెల్లు సూలో, ఏ ఆవు ఎప్పుడు దూడనేస్తదో వాళ్ళకాడ యివరంగా తారీకు లేసి వుంటయ్యంట....ఆ తారీకునాడు ఆవు కాడి కెళ్ళి 'దూడనెయ్యి' అంటే ఎంటనే ఏస్తదంట....'యీ యాళ ఒద్దులే' అంటే, యీనబోయే ఆవుగూడా మానేస్తదంట....అయి గొడ్లుగాదం డమ్మగారూ, గొడ్లుగాదు-మణుసులు" అంటూ పాలవాడు ఆనందపడిపోయాడు.

"ఎట్లాగూ! ఏమిటో మొత్తానికి గాథగానే వుంది—అయితే యింతకూ మన ఆవు కేందూడరా!...." అన్నారు మా అత్తగారు.

"మనా వింకా దూణ్ణెయ్యలే దమ్మగారూ, నిండుసూ లావు మంది..." అన్నాడు మురిసిపోతూ....

"ఏమిటీ! పోయి పోయి చూలావునా కొనుక్కొచ్చావు! ఒరి నీతెలివి మండిపోనూ! శుభమా అంటూ దూడతో రాకుండా, చూలావునెట్లా యింటికి తోలమన్నావురా! ఇందుకేనా నిన్నూ, నీ యిద్దరు పెళ్ళాల్నీ పంపింది" అంటూ మా అత్తగారు అమాంతం పాలవాడిమీద విరుచుకుపడ్డారు.

వాడు భయంతో ఒణికిపోయాడు.

"ఇంక పదిరోజుల్లో దూడ నేస్తది గనక తోలుకెళ్ళొచ్చని ఆ మేనేజరయ్యే సెప్పా దమ్మగారూ—"

"మేనేజరయ్యగాదు వాడి తాత చెప్పినా ఆ చూలావు నాకక్కర్లేదు. మా కచ్చిరాదు. అసలు వెళుతూ వెళుతూ అపశకునంలాగా నీ యిద్దరు పెళ్ళాల్నీ వెంటేసుకెళ్ళినప్పుడే అనుకున్నా—దానికి తగినట్లు యిరవై మూడో నెంబరే దొరికింది నీకు—పాడు నెంబరు. అచ్చిరాని నెంబరు."

"మరిప్పు డేంచెయ్యమంటారు పెద్దమ్మగారూ— ఈ సంగతి యివరంగా ముందే మీకాడ కనుక్కోకుండా ఎళ్లి తెలివితక్కువపని చేశానే" అంటూ బాధపడ్డాడు.

"యింకా నీ కెక్కడేడుస్తుందిరా తెలివి-యిద్దరు పెళ్ళాల్ని కట్టుకున్న తర్వాత ! నిన్ను పంపడం మా బుద్ధితక్కువ....తక్షణం వెళ్ళి ఇచ్చిన డబ్బు వాపసు తీసుకురా" అన్నారు మా అత్తగారు ఖండితంగా.

"అయ్యోరామా - యిప్పుడు నే నడిగితే ఇస్తారో యియ్యరో,... ఎందుకైనా మంచిది అయ్యగార్ని గూడా ఓపాలి అడిగి సెప్పం డమ్మగారూ—"

"పోనీ. ఓపని చేస్తే!—దూడను వేసిందాకా ఆవు నక్కడే వుంచి దూడను వేసిం తర్వాత పంపమంటే పంపుతారా?" అన్నాను నేను కలగజేసుకుని.

పాలవాడి ప్రాణం లే చొచ్చింది.

"ఓ, పంపుతారం డమ్మగారూ-అట్ట పంపకపోతే అవు మన కొద్దంటే సరి—ఎటుతిరిగీ పదిరోజుల్లో దూడ నేస్త దన్నాడు—అటెయ్యకపోతే మేనేజరయ్యే దగ్గరుండి దూణ్ణేపిస్తా నన్నాడు."

"మేనేజరయ్య దూడని వేయిస్తాడో, వేస్తాడో నా కనవసరం. పైయ్యొచ్చే శుక్రవారంనాటికైనా ఆవు దూడతో సహా యింటికి రావాలి. అంతే—యీ సంగతి చెప్పు వాళ్ళతో—" అన్నారు మా అత్తగారు.

"అట్టనే సెప్తా పెద్దమ్మగారూ—రేపు సందకాడే ఎల్తా—"అంటూ పాలవాడు తలగుడ్డలో దాచిన రసీదూ, మిగతా డబ్బూ భయభక్తుల్తో మా అత్తగారి చేతులో పెట్టి 'బ్రతుకుజీవుడా' అంటూ వెళ్ళిపోయాడు.

* * * *

పైయొచ్చే శుక్రవారంనాడు ఆ నొస్తుందని మా అత్తగారు గొడ్ల కొట్టం అంతా శుభ్రం చేయించారు. నా చేత ముగ్గువేయించి, గుంజలకు పసుపూ కుంకం కూడా పెట్టించారు. తోటవాడిచేత మామిడితోరణాలు కట్టించారు.

ఇంతా జేసి శుక్రవారంనాడు ఆవు రాకపోగా పాలవాడుకూడా రాలేదు....ఇంక మా అత్తగారు ఒళ్లు తెలీని కోపంతో ఇల్లంతా తిరిగారు. పాలవాడు ఆరోజు కనిపిస్తే మా అత్తగారు వాణ్ణి నమిలిమింగేస్తా రని పించింది. వేళ మంచిది! వాడు ఆరోజూ, మర్నాడు కూడా రాలేదు. కారణం తెలీక వా డింటికి కబురు పెట్టాం. ఇల్లు తాళంవేసుందట. గురు వారంనాడు రాత్రికిరాత్రే యింటిల్లిపాదీ ఎక్కడికో వెళ్ళిపోయారని ఇరుగు పొరుగువాళ్లు చెప్పారట మా తోటవాడికి. ఇహ మా అత్తగారికి పూనకం వచ్చింది. పాలవాణ్ణి చెడామడా తిట్టడం మొదలెట్టారు.

"నే నప్పుడే చెప్పాను. వాడు ఒట్టి దొంగవెధ వని... యిట్లా పరా రవుతా డని నాకు ముందే తెలుసునే"...అన్నారు...త్రికాలజ్ఞానం గల మా అత్తగారు.

మా యింటికి ఆవు వచ్చేసిం దనుకుని, ఇరుగు పొరుగువాళ్ళంతా జున్నుపాల కోసం, ఆవుపంచితం కోసం మా అత్తగారికి కబురు పెట్టడం మొదలెట్టారు. పాలవాడు మా అత్తగారికి భయపడి దేశాంత్రం పోయా డని మావారికి తెలిపింది.

"పాపం, వాడు మాత్రం ఏం జేస్తాడు...మీ ఆవుబాధ పళ్ళేక ఏ నుయ్యో గొయ్యో చూసుకొనుంటాడు"...అంటూ వాడిమీద జాలిపడ్డారు.

మావార్ని ఆవుసంగతి ఫారమ్‌కు టెలిఫోన్ చేసి కనుక్కో మని చెప్పారు మా అత్తగారు. "టెలిఫోన్ చేస్తే, మేనేజర్ వూర్లోలేడు; మిగతా వివరాలు మనిషిరాంది మాకు తెలీవన్నారు....మేనేజరో, పాలవాడో ఎవరో ఒకరు వచ్చిందాకా ఆగ"మని మావారు సలహా యిచ్చారు. మా అత్తగారు ఒకరి సలహా వినదల్చుకోలేదు....వెంటనే బయల్దేరారు, ఆవు సంగతి తేల్చుకొస్తా నంటూ...దూడను వేసినాసరే, వెయ్యటున్నాసరే తక్షణం ఆవును యింటికి తోలమని చెప్పొస్తానంటూ, తోటవాడిని తోడుపిల్చుకుని కార్లో బయల్దేరి వెళ్ళిపోయారు.

ఆ్రమె అటువెళ్తూనే పాలవాడొచ్చాడు. "ఏంరా ఎక్కడ మాయమైనావ్" అన్నాను. వాడు కండ్లు తుడుచుకుంటూ, "ఏం జెప్పే దమ్మగారూ! పక్క వూళ్ళో మా అన్నకు శానా డేంజర్‌గా వుందని అర్ధరాత్రికాడ తంతి గొట్టారు....రాత్తి రాత్తిరే ఎళ్ళాం. అట మా అన్నకి అయిదుగురుపిల్లలు. తల్లి లేనోళ్లు. ఆళ్ళను సూట్టానికి చెందడానికి నా యిద్దరు పెళ్ళాల్నీ,తమ్ముణ్ణి గూడ తీసుకెళ్ళా...యిప్పుడు మా యన్నకి కాస్త సుమారుగా వుంది.... పిల్లల్ని సూసుకోటానికి పెద్దదాన్ని ఆడే వుంచి, చిన్నదాన్ని మాత్రం తీసుకొచ్చా. తమకి పాలకి శానా యిబ్బం దయివుంటది....అర్ధరాత్రికాడ యింటికొచ్చి మిమ్మల్ని నిద్దర్లేపి యీసంగతి సెప్పడం బాగుండదని అట్టనే ఎల్లిపొయా నమ్మగారూ..."అంటూ వాడి గాథ చెప్పుకున్నాడు.

"అయితే ఆవింకా రాలేదా అమ్మగారూ"అన్నాడు, పెద్దమ్మగారికోసం నాలుగు వైపులా వెతుకుతూ.

"రాలేదురా...యిప్పుడే పెద్దమ్మగారు వెళ్ళారు....చూలావు నైనా వెంటనే యింటికి తోలమని చెప్పిరావడానికిట...."

"అదేంటి చిన్నమ్మగారూ?...సూలావు మా కచ్చిరాదన్నారుగా పెద్దమ్మగారూ....యీ మాట ఆయాలే సెప్పినట్లయితే సరిపొయ్యేదిగా!

...అయితే రేపొస్త దన్నమాట ఆవు...మరి నేగూడా సందకాడే గొడ్లని తోలకొచ్చి ఆవొచ్చేయాళ కీ డుంటానం డమ్మగారూ"....అని చెప్పి వెళ్ళి పోయాడు పాలవాడు...

దీపాలు పెట్టేసరి కంతా తిరిగొచ్చేశారు మా అత్తగారు --

"ఆవును చూశారా!" అన్నాను ఉత్సాహంగా.

"ఆవునూ చూళ్ళేదు, నా తలకాయా చూళ్ళేదు...అదెక్కడుందో వెతికేసరికే నా తాతలు దిగొచ్చేటట్టున్నారు! అదేం 'ఫారమో' ఎత్తుభారం —యాభై ఎకరా లుంది—అన్నిగొడ్లల్లో మన ఆవు ఎక్కడుందో ఎవర్నడిగేది!—దానికి తగినట్లు మేనేజరు వూళ్లోలేడు. మా కా వివరాలు తెలీ వన్నారు. కాసేపటికి ఎవడో వచ్చి 'మీకు దాన్నెంబరు తెలుసా?' అని అడిగాడు. 'తెలు'సంటూ 'యిరవై మూడో నెంబరు' అని చెప్పాను...మన యెడ్రసడిగాడు, చెప్పాను...'ఆ నెంబర్ను ఎప్పుడు తోలాలి?' అన్నాడు—తక్షణం తోల మన్నాను. రేపు తెల్లవారేసరికి ఆ నెంబరు మనింటిదగ్గిరుండాలని గట్టిగా చెప్పొచ్చాను. 'సరే' నన్నాడు."

"పాలవా డొచ్చా" డన్నాను

"ఆ దొంగవెధవ సంగతి నాతో చెప్పవాక...యీ రెండు రోజులూ ముఖం తప్పించి నేనటు వెళ్ళంగానే నీదగ్గిర కల్లబొల్లి కబుర్లు చెప్పడానికి వచ్చా డన్నమాట! సిగ్గులేనివెధవ...ఏముఖం పెట్టు కొచ్చాడు" అన్నారు మండిపడుతూ...

"వాడి అన్న కేదో జబ్బుగా వుందని—" అంటూ నేను పూర్తి చేయక ముందే మా అత్తగారి త్రికాలజ్ఞానం నా కడ్డుతగిలింది.

"నాకు ముందే తెలుసే వా డీలాంటి దేదో చెప్తా డని...వాడి మాటలు నువ్వూ, నీ మొగుడూ నమ్ముతారు గనకనే అట్లాంటి కథ లన్నీ చెబుతుంటాడు...నాదగ్గిర చెప్పమను...! అందుకే నన్ను చూస్తే వాడికి చచ్చేంత భయం..." అంటూ లేచి నిలబడ్డారు మా అత్తగారు.

"అన్నట్లు తెల్లవారుఝామునే లేచి బాయిలర్ అంటించి వేణ్ణీళ్ళు పెట్టాలి-పాపం. నోర్లేనిగొడ్డు. అన్ని మైళ్ళదూరాన్నుంచి నడిచొస్తుంది... వేణ్ణీళ్ళతో బాగా దానికాళ్ళూ, ఒళ్ళూ కడగమని చెప్పాలి మనతోటవాడితో ....నాలుగింటికి అలారం పెట్టు'' అంటూ పెరటివైపు వెళ్లారు మాఅత్తగారు.

నేను నాలుగింటికి అలారం పెట్టాను...ఈ సంగతి తెలీక ప్రొద్దున్నే 'మీటింగ్' వుందని మావారు ఆరింటికి 'కీ' యిచ్చిపెట్టారు...యీ రెండూ తెలీక మావాడు పరీక్షలకు చదువుకోడానికి రెండుగంటలకే తిప్పి పెట్టాడు...

రాత్రి రెండు గంటలకంతా అలారం గోలగోలగా కొట్టుకుంది— మంచి నిద్రవేళ...'నాలుగింటికి పెడితే రెండింటికి కొట్టిం దేమిటీ!...' అనుకున్నాను ..'ఆరింటికి పెడితే పన్నెండింటికే కొడుతోంది...యీ అలారం చెడిపోయినట్లుంది. తీసి దిబ్బలోపారెయ్' అన్నారు మావారు నిద్దట్లోనే... మావాడి రూములో లైటు వెలిగింది...నాకప్పు డర్థమైంది....వాడితోకూడా కూర్చుని హిందీ పాఠాల్లో సహాయం చేశాను, నాలు గయిందాకా...

తెల్లవారింది—ఆవును ఆహ్వానించడానికి అన్నీ సిద్ధం చేశారు మా అత్తగారు.

పసుపుకుంకాలూ, పూలూ, పళ్ళూ, టెంకాయా, తాంబూలం, హారతి కర్పూరం వగైరాలతో ఆవుకోసం బయట వరండాలో కూర్చున్నాం మా అత్తగారూ, నేనూ.

పాలవాడు గేదెల్ని తోలుకొని చిన్నపెళ్లాంతో సహా వచ్చాడు....మా అత్తగారు ప్రొద్దున్నే వాడిమీద ఎక్కడ విరుచుకు పడతారో నని భయ పడ్డాను....అసలు వాడివైపే చూళ్లేదు....ఆవుకోసం జపంచేస్తూ తపస్సులో కూర్చున్నారు. ఎవరితోనూ మాట్లాడకుండా....

ఆరయింది....ఏడయింది.....ఎనిమిదయింది.....తొమ్మిదయింది..... ఆవురాలేదు. మావారు మా అవస్థకు నవ్వుకుంటూ మీటింగుకెళ్ళిపోయారు.

నిండు చూలాలు గనక ఒకవేళ నడవలేక నడుస్తోందేమో నని ఒక వైపూ, ఒకవేళ దూడను ఈని వున్నట్లయితే పచ్చి ఒంటితో యింతదూరం నడవలేక అవస్థ పడుతోందేమోనని మరోవైపూ, ఇలా పరిపరి విధాల పోయింది మా అత్తగారి మనసు....

మొత్తానికి పదిగంట లయినా ఆవు రాకపోయేసరికి మా అత్తగారు మరీ కలవరపడసాగారు....నా ముఖం ఆమె, ఆమెముఖం నేనూ చూసుకున్నాం ప్రశ్నార్థకంగా....గేట్లో గంటల చప్పుడు వినిపించింది....మా అత్తగారి ప్రాణం లేచొచ్చింది....

"వొచ్చినట్టుంది, పదపద, ముందు దానికి దృష్టితీయాలి"....అంటూ పళ్ళెంలో ఎర్రనీళ్ళు కలిపి, మధ్యన కర్పూరం పెట్టి నా చేతి కిచ్చింది మా అత్తగారు.

గేటుదాటి లోపలికొస్తూనే ఆకాశం దద్దరిల్లేట్లు ఒక్క రంకె వేసి, మేరు పర్వతంలా ఒచ్చి మా ముందు నిలబడ్డది...బ్రహ్మాండమైన వృషభం...

'ఆ!..' అంటూ నోట మాటలేకుండా గుడ్లు తేలేశారు మా అత్తగారు...

పాలవాడు తలగుడ్డచాటున చచ్చేట్లు నవ్వుతున్నాడు—

వాడి పెళ్ళాం గేదెలచాటున పడిపడి నవ్వుతోంది—

నేను నవ్వాపుకుంటూ, "ఈ ఎద్దును యే అడ్రసుకు తోలమన్నారు!" అని అడిగాను, తోలుకొచ్చినవాడిని-ఒకవేళ అడ్రసు మారి వచ్చాడేమోనని.

"ఈ అడ్రసుకే అమ్మగారూ....తెల్లారేసరికి యిరవై మూడోనెంబర్ని యీ అడ్రసుకి తోలమని మా అసిస్టెంటు మేనేజరయ్య చెప్పాడు—కావాలంటే అడ్రసు చూడండి—" అంటూ చిన్న చీటీ చూపించాడు,

నిజమే—ఇంకేం అడిగేది! — మా అత్తగారివైపు చూశాను. ఆమె కొంచెం తెప్పరిల్లి "అది కాదురా! ఇరవైమూడో నెంబరు ఆవును తోలమన్నాగాని, అచ్చోసిన యీ ఆంబోతునా తోలమన్నా....! ఎవడ్రా

ఆ తల్లేని అష్టిష్టెంటు మేనేజరూ—" అని మా అత్తగారు తోలుకొచ్చిన వాణ్ణి ఝూడిస్తుండగానే టెలిఫోన్ వచ్చింది.

'ఫారమ్' నుంచి అసిస్టెంట్ మేనేజరే మాట్లాడాడు—

పొరపాటు జరిగిపోయిం దనీ, ఇరవై మూడో నంబరు ఆవును కట్టేసేచోట ఎద్దును కట్టేశా రనీ, ఇరవై మూడో నంబరు ఆవు అసలు చూలు గాదనీ, దాని కేదో గర్భకోశంలో జబ్బువల్ల కడుపు లావయిందని డాక్టరు చెప్పా డనీ, డబ్బు వాపసు పంపిస్తున్నందుకు క్షమించాల్సిందనీ, 'ఫారమ్' ఆరంభించింతర్వాత యిలాంటి పొరపాటు జరగడం ఇదే మొదటిసారి అనీ చెప్పి కట్ చేశాడు...

"గేదె అచ్చిరాలే దంటే మనకు ఆవుగూడా అచ్చిరాలే దన్నమాట-" అన్నారు మా అత్తగారు, నిట్టూర్పు విడుస్తూ....